రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: రోడ్లు బాగుంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని బైరంపల్లి నుంచి కొందుర్గు వరకు పార్మేషన్ రోడ్డు నిర్మాణం పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ప్రతి పల్లెకు రోడ్లు వేయడం జరిగిందన్నారు. గల్లీగల్లీకి సిమెంట్ రోడ్లు వేశామని తెలిపారు. మహిళలు ఇబ్బందులు పడకుండా సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతి గడపకు చేరుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు విశ్వం, రామకృష్ణ, రామయ్య, చంద్రయ్య, నర్సింలు, మల్లేష్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు: రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

లంకాల రాంరెడ్డికి ఘన నివాళ్లు

షాద్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు లంకాల రాఘవేందర్‌రెడ్డి తండ్రి కీ.శే లంకాల రాంరెడ్డికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. గత పది రోజుల క్రితం లంకాల రాంరెడ్డి గుండెపోటుతో మరణించారు. ఆదివారం పట్టణంలోని బాలాజీ టౌన్ షిప్‌లో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ నేత సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, నారాయణరెడ్డి, రఘుమారెడ్డి, నారాయణ యాదవ్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, రజినీకాంత్‌గౌడ్ ఉన్నారు.

పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గుండెనాయక్‌తండాకు చెందిన బీజేపీ గిరిజన మోర్చా జిల్లా నాయకుడు వినోద్‌నాయక్ ఆ పార్టీకి రాజీనామా చేసి తండావాసులతో కలిసి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినోద్‌నాయక్‌తో పాటు పార్టీలో చేరిన వారికి శంకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. దళిత, గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు, భూములను పంచిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో శంకర్‌నాయక్, బాబు, శ్రీను, రాజు, సీతారాములు, దేవుజా, మహేష్, వెంకటయ్య, నరేష్, కృష్ణ, వెంకటయ్య, కందర్, నర్సింలు, గణేష్, శ్రీకాంత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనునాయక్, కృష్ణ, సుదర్శన్, గోపాల్‌నాయక్, గణేష్‌రాథోడ్, రాజునాయక్, సీతారాం, అశోక్, నర్సింలు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్

క్లుప్తంగా

కేజీబీవీ హాస్టల్ రోడ్డును అభివృద్ధి చేయండి

కొత్తూరు: మండలకేంద్రం నుంచి కేజీబీవీ హాస్టల్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రోడ్డు అభివృద్ధి చెందని కారణంగా హాస్టల్‌కు వెళ్లే విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దానికి తోడు రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి, రాత్రిళ్లు భయానకంగా ఉంటుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రిన్సిపాల్ ఆనంద్


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయునులు

షాద్‌నగర్‌టౌన్: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ ఆనంద్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పులు రావాలన్నారు. అదే విధంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు అనే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా చదువుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, సుధాకర్, రఘు, శ్రీధర్, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా ఉపాధ్యక్షుడు సింగపాగ జంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం పూలే అంబేడ్కర్ 3వ జాతర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. నేటి యువత పూలే అంబేడ్కర్ సూచించిన బాటలో ముందుకు సాగాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో ఈ నెల 29న పూలే అంబేడ్కర్ జాతర నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పూలే అంబేడ్కర్ జాతరను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని దళిత, బహుజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ జాతర నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు జంగయ్య, రఘునాయక్, రమేష్, చందర్‌నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వశక్తిని తీసుకోవడమే ధ్యానం

ధ్యాన ప్రచార కార్యదర్శులు ఆంజనేయరెడ్డి, శైలజ



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న శైలజ

షాబాద్: ధ్యానంలో విశ్వశక్తిని తీసుకుంటామని విశ్వశక్తి ప్రసారం జరిగి రోగగ్రస్త నాడులు శుభ్రపడతాయని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శులు బంగ్లా ఆంజనేయరెడ్డి, గుండం శైలజ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వశక్తిని తీసుకోవడానికి ధ్యానం ఒక యాంటెన్నా లాంటిదని అన్నారు. యుక్త వయసులోనే గుండె జబ్బుల బారిన పడుతున్నారని, ఒత్తిళ్లతో బీపీ, షుగర్ వ్యాధులు కొని తెచ్చుకుంటున్నారని చెప్పారు. ధ్యానం ఇలాంటి రోగాలన్నింటినీ రాకుండా నివారిస్తుందని సూచించారు. ధ్యానం చేయడం వల్ల ప్రస్తుతం శరీరంలో ఉన్న జబ్బులు తొలగి భవిష్యత్‌లో వ్యాధులు రావన్నారు. ఎవరి వయస్సు ఎంత ఉంటుందో అన్ని నిమిషాల పాటు ప్రతిరోజు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటలక్ష్మి సుభద్ర, కృష్ణమద్దిలేటి, యాదయ్య, విజయ్‌కుమార్, గ్రామస్తులు తదితరులున్నారు.

యువతకు ఛత్రపతి శివాజీ ఆదర్శం

ఎంపీపీ ప్రశాంతిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సేవ ప్రముఖ్ రమేశ్

షాబాద్: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సేవ ప్రముఖ్ బండారి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సర్దార్‌నగర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ వనిత, విగ్రహ దాత డాక్టర్ శంకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదురించి మరాఠా వీరుడిగా పేరు గాంచిన గొప్ప వ్యక్తి ఛత్రపతి శివాజీ అని చెప్పారు. భారతమాత ముద్దుబిడ్డ స్త్రీని గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడని కొనియాడారు. యువత ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ ఇంద్రమ్మ, గ్రామస్తులు జగదీశ్, రాంమోహన్, హరీశ్, ప్రవీణ్, శరత్‌రెడ్డి, సర్వేర్, అశోక్, రఘు, చరణ్ తదితరులున్నారు.


విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, రమేశ్

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం


కమిటీ సభ్యులతో పార్టీ నాయకులు

చేవెళ్ల: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని ఆ దిశగా కిందిస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గం నాయకులు ఎస్.వసంతం, జిల్లా పార్టీ నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, పెంటయ్యగౌడ్‌లు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు అలంపల్లి వీరేందర్‌రెడ్డి ఆధ్యక్షతన చేవెళ్ల గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గం, జిల్లా నాయకులతో పాటుగా పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. మండల కమిటీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో కమిటీలు, అనుబంధ కమిటీలను పూర్తిస్థాయిలో వేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీల ద్వారా గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ చేయబోయే కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సమస్యలపై ప్రజలకు వారికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి, ఎంపీటీసీ రాములు, మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజీద్, యూత్ అధ్యక్షుడు శ్రీను, ఉప సర్పంచ్ యాదయ్య, నాయకులు ప్రభాకర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను, రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల ఎన్నిక

ఈ సమావేశంలో చేవెళ్ల గ్రామ కమిటీని ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు హరికృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా యాదయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా లకేత్, యూత్ అధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎంపికైన సభ్యులకు నియామక పత్రాలను అందించి వారిని శాలువాలతో సన్మానించారు.

నూతన నియామకం


రఘుగౌడ్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ టంగుటూరి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా రఘుగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, మండల బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా లింగంగౌడ్ నియమితులయ్యారు. ఈ సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం నూతన సభ్యులకు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్ గుప్తా, అందెబాబయ్య, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

433మంది హాజరు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వీటీజీ సెట్-23 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు. ఉ.11:00గంటల నుంచి మధ్యాహ్నం 1:00గంటల వరకు ప్రవేశ పరీక్ష కొనసాగింది. మొత్తం 480మంది విద్యార్థులకు గాను 433 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద పకడ్బందీ చర్యలను చేపట్టారు. హాల్ టికెట్‌లను పరిశీలించి విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష సెంటర్‌లోకి అనుమతించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 5వ తరగతిలో ప్రవేశం లభిస్తుందని ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గణేశ్, వెంకట్‌రెడ్డి తదితరులు

జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ పేర్కొన్నారు. నందిగామ అనుబంధ గ్రామం పిట్లలగూడలో 'పిట్లల గూడ ప్రీమియర్ లీగ్' (పీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డితో కలిసి జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పోటీలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకొని, తమ నైపుణ్యం మెరుగుపర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామానికి ఒక క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసిందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమేనని చెప్పారు. స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలని ఆయన సూచించారు. వారం రోజుల పాటు ఈ టోర్నమెంట్ కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యుడు చెన్నయ్య, టైలర్ కృష్ణ, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

ప్రిన్సిపాల్ ఉమమహేశ్వర్‌రావు

శంకర్‌పల్లి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ రావు పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భజన మండలి శంకర్‌పల్లి వారి ఆధ్వర్యంలో ఆదివారం శంకర్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భజన మండలి సేవలు మరువలేని అన్నారు. వేసవి కాలంలో చలివేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు శంకర్, శ్రీనివాసరాజు, బాలకృష్ణ, రాఘవులు, నర్సింలు, సురేష్, మాధవి, శోభ, రవికుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయండి

కొందుర్గు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 25న చేపట్టనున్న నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మయ్య కోరారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో చౌదరిగూడలో నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మండలంలోని నిరుద్యోగ యువతి, యువకులు, బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసు, రాజు, హరీశ్, అనిల్‌కుమార్, రామకృష్ణ, రామ్ లక్ష్మణ్, నరేష్, రాజ్‌కుమార్, నవీన్, ప్రభు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడు

ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అంజయ్య యాదవ్

శంకర్‌పల్లి: మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం బసవేశ్వర జయంతి సందర్భంగా శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న దురాచారాలను రూపుమాపడానికి బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, కౌన్సిలర్ చంద్రమౌళి, వీరశైవ సమాజ సంఘం మండల అధ్యక్షుడు సూర్యం, సభ్యులు చంద్రశేఖర్, హోంప్రకాష్, నాగులు, రాజేశ్వర్, వివానందం,శేఖర్, వీరేందర్, లింగం తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి: బసవేశ్వరుడికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


కొందుర్గు: బసవేశ్వర జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

సమాజాభివృద్ధికి కృషి

షాబాద్: సమాజంలో అస్పృశ్యతా నివారణకు కృషి చేసిన బసవేశ్వరుడి జయంతి నిర్వహించడం అభినందనీయమని హోప్ ఫౌండేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బసవేశ్వరుని జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం షాబాద్ శివాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ కేడలిలో మే 14న బసవేశ్వరుని విగ్రహావిష్కరణ చేస్తామన్నారు. సర్వేజనోసుఖినోబవంతు అనే నినాదంతో ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ పోయిన వీరుడే బసవేశ్వరస్వామి అని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం బసవేశ్వరుడి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో షాబాద్ సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరీ రవీందర్, గ్రామస్తులు లింగప్ప, మల్లికార్జున్, ప్రదీప్, నవీన్, బస్వరాజ్, శేఖర వీరేశ్, మల్లేశ్, సందీప్, విశ్వనాథ్, రవిశంకర్, రాజేష్, మల్లప్ప, తదితరులున్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

మొయినాబాద్: తొమ్మిది శతాబ్దాల క్రితమే మహాత్మా బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని వీరశైవ లింగాయత్ సేవా సమాజం మండల అధ్యక్షుడు పురాణం వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని చిలుకూరు బాలాజీ సమీపంలోని కాశీ విశ్వనాథ ఆలయంలో బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 900 ఏళ్ల క్రితమే బసవేశ్వరుడు సమానత్వం, కుల వివక్షతపై పోరాడారన్నారు. ఆయన ఆశయాలను నేటి సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేడిపల్లి సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వీరశైవ లింగాయత్ సేవా సమాజం ప్రతినిధులు ప్రభులింగం, భిక్షపతి, బస్వరాజు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో బసవేశ్వర జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొందుర్గులోని బసవేశ్వరస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బసవేశ్వరుడు అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు యాదయ్య, విశ్వం, రామకృష్ణ, చంద్రశేఖర్, గోపాల్, రాజారమేష్‌రెడ్డి, నర్సింలు, శంకర్ గౌడ్, సంజీవ్, గోపాల్, వీర శైవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి సేవలు చిరస్మరణీయం

నందిగామ: మహాత్మా బసవేశ్వర స్వామి 890వ జయంతి వేడుకలను మండల కేంద్రమైన నందిగామలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర స్వామి విగ్రహానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. కుల, లింగ, వర్ణ అసమానతలకు వ్యతిరేకంగా సమ సమాజ స్థాపన కోసం అయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. యువత సన్మార్గంలో నడిచేందుకు అయన చూపిన మార్గం ఎంతో గొప్పదని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, నాయకులు కృష్ణా రెడ్డి, లక్ష్మణ్, రామస్వామి, సీతారం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో..

బసవేశ్వర స్వామి జయంతి వేడుకలను పురస్కరించుకొని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ ఆధ్వర్యంలో పలువురు నేతలు బసవేశ్వర స్వామి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యువ సత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, అప్పారెడ్డిగూడ సర్పంచ్ జేకే నర్సింహులు, చంద్ర శేఖరప్ప, సతీష్, మహేష్, కృష్ణగౌడ్, టైలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కుల్కచర్ల: ఆపదలో ఉన్న బాల్య మిత్రుడి కుటుంబాన్ని నాటి సహ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. 2005 సంవత్సరంలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు.. శ్రీనివాస్ భార్యకు రూ.50,700లు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గోవింద్, నవీన్, తులసిరాం, బాల్‌సింగ్, రాజు, రవీందర్, బాల్‌రాజ్, గోపాల్, రాంచందర్, యాదయ్య పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు వితరణ

యాలాల: హాజీపూర్ గ్రామానికి చెందిన లాలప్ప, నాగమణి దంపతుల కూతురు అనురాధ వివాహం ఆదివారం జరగగా.. తన వంతు సహాయంగా సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇక ముందు పేదింటి ఆడబిడ్డల వివాహానికి పుస్తెమెట్టెలు అందజేస్తానని తెలిపారు.